సాక్షి

# నేడు ఎంసెట్ ఫలితాలు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 22 నుంచి 25 వరకు నిర్వహించిన ఎంసెట్-2018 ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. విజయవాడలో రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు వీటిని విడుదల చేస్తారని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు తెలిపారు. ఎంసెట్‌కు 2,76,189 మంది దరఖాస్తు చేయగా ఇంజనీరింగ్ విభాగంలో 1,90,924 మంది; అగ్రి, మెడికల్ విభాగంలో 73,371 మంది పరీక్ష రాశారు. ఏప్రిల్ 25న ప్రాథమిక 'కీ'ని విడుదల చేసి 27 వరకు అభ్యంతరాలు స్వీకరించారు. అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించి నివేదికను ఖరారు చేసింది. దీన్ని ఎంసెట్ కమిటీ ఆమోదానికి పంపారు. మార్పులూచేర్పుల అనంతరం తుది ఫలితాలను ర్యాంకులతో సహా నేడు ప్రకటించనున్నారు.

## నేడు ఎంసెట్-2018 ఫలితాలు

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** ఇంజినీరింగ్, అగ్రికల్చర్ మెడిసిన్ -2018 కోర్సుల ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఎంసెట్ -2018 ఆన్‌లైన్ పరీక్ష ఫలితాలు బుధవారం మధ్యాహ్నం విడుదల కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతీయ కేంద్రాల్లో గత నెల 22, 23, 24 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగానికి, 25వ తేదీన అగ్రికల్చర్ మెడిసిన్ పరీక్షలు నిర్వహించారు. ఇంజనీరింగ్ విభాగంలో 15,346 మంది హాజరుకాగా, వీరిలో బాలురు 8934, బాలికలు 6412 మంది ఉన్నారు. అగ్రికల్చర్ మెడిసిన్ విభాగంలో 4977 మంది హాజరుకాగా, వీరిలో 1315 బాలురు, 3662 మంది బాలికలు ఉన్నారు. ఫలితాలు మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేయనుండగా, విద్యార్థుల మొబైల్స్‌కు గంట వ్యవధి కాలంలో మార్కులు, ర్యాంకు సమాచారం రానుంది.

## డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పొందిన జయప్రసాద్

**బాలాజీచెరువు:** జేఎన్‌టీయూకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.జయప్రసాద్ సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్‌ను జేఎన్‌టీయూకే ప్రదానం చేసింది. పరిశీలకుల బృందం సిఫార్సు మేరకు వి.జయప్రసాద్ సిద్ధాంత వ్యాసం 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఏఎల్ 5083-ఎస్ఐసీ మెటల్ మ్యాట్రిక్స్ కాంపోజిట్ అండ్ ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ప్రాపర్టీస్ బై ఈక్వల్ ఛానల్ యాంగులర్ ఎక్స్‌ట్రూషన్' జేఎన్‌టీయూకే అధికారుల ఆమోద ముద్ర పొందింది. ఈయనకు పీహెచ్‌డీ 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో లభించింది. వి.జయప్రసాద్ తన సిద్ధాంత వ్యాసాన్ని ప్రకాశం జిల్లాలోని చీరాల ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.కమలుద్దీన్, కాకినాడలోని జేఎన్‌టీయూకే కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (యూజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.మోహన్‌రావు పర్యవేక్షణలో సమర్పించారు. ప్రస్తుతం జయప్రసాద్ కాకినాడ జేఎన్‌టీయూకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.